క్లుప్తంగా

స్ట్రాంగ్ రూములు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన పోలింగ్ పూర్తి అయిన తర్వాత భద్రపరిచిన రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూములను శనివారం రాత్రి కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ పరిశీలించారు. ఒంగోలు పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంల స్ట్రాంగ్ రూముల తలుపులకు వేసిన సీళ్లు, భద్రతా చర్యలను పర్యవేక్షించి పలు సూచనలు చేసారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పరిశీలన అనంతరం సంబంధిత రిజిస్టర్‌లో కలెక్టర్, ఎస్పీలు సంతకాలు చేశారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ముందుకు సాగుదాం

- వన్‌టౌన్ సీఐ ఎస్‌కే అలీసాహెబ్



సూచనలు చేస్తున్న సీఐ ఎస్‌కె అలీసాహెబ్

ఒంగోలు: ఎన్నికల కోడ్ దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని రాజకీయ పార్టీలు పోలీసుశాఖకు సహకరించాలని వన్‌టౌన్ సీఐ ఎస్‌కే అలీసాహెబ్ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఆవరణలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కూటమి పార్టీలు అయిన టీడీపీ, జనసేన, బీజేపీ తోపాటు ఇతర రాజకీయ పార్టీల నేతలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోగలిగామని, అయితే కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న అల్లర్లపై ఎన్నికల కమిషన్ సీరియస్‌గా ఉందన్నారు. ఈ నేపథ్యంలో మన ప్రాంతంలో కౌంటింగ్ సందర్భంగా కూడా ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రతి నాయకుడు, ప్రతి రాజకీయ పార్టీ సంయమనం వహించాలన్నారు. జూన్ 4వ తేదీ కౌంటింగ్ సందర్భంగా పోలీసుశాఖ అప్రమత్తంగా ఉందని, ఎవరైనా అల్లర్లకు పాల్పడినట్లయితే అరెస్టులు చేస్తామన్నారు. ప్రతి ఎన్నిక సమయంలో బైండోవర్‌లు వంటివి తప్పవన్నారు. ఇంకా ఎవరైనా యువత ఉన్నట్లయితే వారు ఉద్యోగ అవకాశాలను చేజార్చుకున్నవారు అవుతారని, వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. అదే విధంగా ఎన్నికల సందర్భంగా జిల్లాకు చేరుకున్న కేంద్ర బలగాలు కూడా జూన్ 19వ తేదీ వరకు జిల్లాలోనే ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణానికి సహకరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్సై కిషోర్, రైటర్ ఎస్‌కె రసూల్, ఏఎస్సై జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని నల్లమడుగులలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధనా మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల మూలవిగ్రహమూర్తులకు, ఉత్సవ మూర్తులకు అభిషేకం, కుంకుమపూజతో పలు విశిష్ట పూజలు చేశారు. అనంతరం అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవం జరిపించారు. పూజల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్, జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు, వెలిగండ్ల జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి పలువురు పాల్గొన్నారు. ఈసందర్భంగా సాయంత్రం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం వైభవంగా సాగింది.

నేడు చేజర్లమ్మ తిరునాళ్లు

ఒంగోలు రూరల్: మండలంలోని చేజర్ల గ్రామంలో వేంచేసి ఉన్న చేజర్లమ్మ తిరునాళ్లను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఒంగోలు నగరం, మండలంలోని గ్రామాలతో పాటు కొత్తపట్నం మండలంలోని గ్రామాల నుంచి ప్రజలు భారీగా తిరునాళ్లకు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తిరునాళ్లు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తాగునీరు, మజ్జిగ, ఉచిత అన్నదానం చేసేందుకు సిద్ధం చేశారు. భక్తులు ఉదయం నుంచి గ్రామ దేవస్థానం వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకుని అమ్మవారి దర్శనం అనంతరం అన్నదానంలో పాల్గొననున్నారు. ఎలక్షన్ కోడ్ నిబంధనలు అమలులో ఉన్న నేపథ్యంలో వివిధ వర్గాలు, పలు రాజకీయ పార్టీల ప్రభలు ఈ ఏడాది ఉండకపోవచ్చని భావిస్తున్నారు. పోలీస్ అధికారులు ఇప్పటి వరకు ఒక చేజర్ల అమ్మవారి ప్రభకు మాత్రమే అనుమతిచ్చారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసేందుకు ఒంగోలు తాలూకా పోలీసులతో పాటు ఒంగోలు మహిళా కానిస్టేబుళ్లను నియమించారు.



ముఖద్వారం



చేజర్లమ్మవారి దేవస్థానం, ప్రాంగణం



చేజర్లమ్మవారు..

వైభవంగా కన్యకాపరమేశ్వరి నగరోత్సవం

- ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన
- సామూహిక కుంకుమ పూజ

ఒంగోలు మెట్రో: కన్నుల పండువగా వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం నిర్వహించారు. నగరంలోని గాంధీ రోడ్డు, కన్యకా పరమేశ్వరి అమ్మవారి వీధిలో కొలువైయున్న వాసవీ కన్యకా పరమేశ్వరిదేవికి తదియారాధన సంఘం వారి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నగరోత్సవాలు శోభాయమానంగా నిర్వహిస్తున్నారు. శనివారం మూడో రోజు ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు ఫణిశర్మ, సాయి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం పది గంటలకు 108 మంది కన్యలతో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సాహంగా బాలికలు అమ్మవారికి పూజ నిర్వహించారు. సాయంత్రం మండల ఆర్యవైశ్య సంఘం వారిచే అమ్మవారి నగరోత్సవం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, అమ్మవారి గీతాలు, వాసవీ కన్యకా పరమేశ్వరి కోలాట భజన మండలి వారిచే కోలాట ప్రదర్శన ఆలయ మాడవీధుల్లో శోభాయమానంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు. కార్యక్రమాలను ఆలయ సంఘ ప్రతినిధులు పర్యవేక్షించారు.



అమ్మవారి వేషధారణలో కళాకారులు



సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న బాలికలు

భక్తిశ్రద్ధలతో కన్యకాపరమేశ్వరి జయంతి

చీమకుర్తి: శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను చీమకుర్తిలోని హరిహర క్షేత్రంలో స్థానిక భక్తులు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి లక్ష్మీపద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాసవీ మహిళలు 102 కలశాలతో నగరేశ్వర స్వామి ఆలయం నుంచి హరిహరక్షేత్రం వరకు ఊరేగింపుగా వచ్చారు. అనంతరం హరిహరక్షేత్రంలోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, లలిత సహస్రనామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత హరిహరక్షేత్రంలోని సకల దేవతలకు లక్ష్మీపద్మావతి పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు.



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో సీతమ్మవారి జయంతి వేడుకలు

ఒంగోలు మెట్రో: వైశాఖ మాసం, శుద్ధ నవమి సీతా అమ్మవారి జయంతి వేడుకలను నగరంలో వైభవంగా నిర్వహించారు. శనివారం నగరంలోని పలు వైష్ణవాలయాల్లో దేవస్థాన నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక పీవీఆర్ గరల్స్ హైస్కూల్ దగ్గర గడియారం వారి వీధిలోని అనంత కోదండరామస్వామి మందిరంలో, మంగమూరు రోడ్డులోని అయ్యప్ప నగర్‌లో సీతారామస్వామి దేవస్థానంలో, గాంధీ రోడ్డులోని కోదండ రాముడి దేవాలయంలో, గాంధీనగర్ మూడో లైన్‌లో సీతారామ దేవాలయంలో, సత్యనారాయణపురం అనంత కోదండరామ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం, పుష్పాలంకరణ గావించి, సీతారామ లక్ష్మణ స్వామికి అష్టోత్తర శతనామాల పూజ నిర్వహించారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి..

సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆరు గంటలకు ఆలిండియా కళారంగం ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి అలరించింది. సంగీత విభాగంలో పాల్గొన్న గాయనీ, గాయకులు ఏ. మనోహర్, డి. కోటేశ్వరరావు, టి. శ్రీదేవి, చల్లా నాగేశ్వరి, ఎస్. లక్ష్మి పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం విశేషంగా ఆనందింపజేసింది. బ్రహ్మశ్రీ ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు, ప్రకాశం జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు సీతమ్మవారి జీవిత చరిత్రను చక్కగా భక్తులకు వివరించారు. అనంతరం నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో శ్రీనివాసులని ఘనంగా సన్మానించారు. ఆలయ అధ్యక్షుడు వేమూరి శ్రీనివాసరావు, అర్చకుడు రాముశర్మ, కిషోర్ కుమార్, ఆలిండియా కళా రంగం కోశాధికారి చల్లా బాలకొండయ్య భక్తులు పాల్గొన్నారు.



పొన్నూరు శ్రీనివాసులును సన్మానిస్తున్న ఆలిండియా నిర్వాహకులు

క్యుంగ్‌డాంగ్ యూనివర్శిటీతో క్విస్ సెట్ ఎంవోయూ

ఒంగోలు: దక్షిణ కొరియాలోని క్యుంగ్‌డాంగ్ యూనివర్శిటీ గ్లోబల్‌తో ల్యాండ్ మార్క్ ఒప్పందం చేసుకున్నట్లు క్విస్ సెట్ అధినేత నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం క్విస్ సెట్, క్యుంగ్‌డాంగ్ యూనివర్శిటీ ప్రతినిధులతో జరిగిన ఒప్పంద వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ముఖ్యమైన భాగస్వామ్యం, సమగ్ర సహకారం ద్వారా విద్య, పరిశోధన అవకాశాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్టూడెంట్ ఎక్స్ఛేంజి ప్రోగ్రామ్‌లు రెండు సంస్థల విద్యార్థులకు అంతర్జాతీయ ఎక్స్‌పోజర్, క్రాస్ కల్చరల్ లెర్నింగ్ అనుభవాలను సులభతరం చేయడం, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజిలో బోధన, పరిశోధన అవకాశాల పెంపు, విద్య, వృత్తిపరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం, పరిశోధన సహకారాలు, వివిధ రంగాల్లో ఆవిష్కరణలు, పురోగమనాలను నడిపేందుకు జాయింట్ రీసెర్చ్ ప్రాజెక్టుల్లో పాల్గొనడంలో ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని చెప్పారు. గ్రాంట్లు, పేటెంట్లు, పరిశోధన గ్రాంట్లు పొందడం, సంచలనాత్మక పరిశోధన, దాని వాణిజ్యీకరణకు మద్దతుగా పేటెంట్లను అభివృద్ధి చేయడంలో సహకరిస్తారని క్యుంగ్‌డాంగ్ యూనివర్శిటీ అధ్యక్షుడు డాక్టర్ జాన్ క్యూలీ పేర్కొన్నారు. ఈ సహకారం విద్య, పరిశోధన నైపుణ్యం నూతన శకాన్ని సూచిస్తుందన్నారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో ప్రొఫెసర్ ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీ అసోసియేట్ డీన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హెడ్, ఎండీ డాక్టర్ నూర్ ఆలం, కొరియన్ యూనివర్శిటీ అడ్మిషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ జూలియా జంగ్, ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు, డైరెక్టర్ డీపీఎస్‌ఆర్ డాక్టర్ బీవీ సుబ్బారావు, డైరెక్టర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ ఫారిన్ అఫైర్స్ డాక్టర్ జాఫర్ ఆలీ ఇబ్రహీం పాల్గొన్నారు.



ఒప్పందంపై సంతకాలు చేస్తున్న క్విస్ సెట్ అధినేత నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, క్యుంగ్‌డాంగ్ యూనివర్శిటీ అధ్యక్షుడు డాక్టర్ జాన్ క్యూలీ

తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో 854వ ర్యాంకు

ఒంగోలు: తెలంగాణ నిర్వహించిన ఎంసెట్ ఫలితాల్లో స్థానిక శ్రీసరస్వతి జూనియర్ కాలేజీ విద్యార్థి కె.సాకేత్ సాయిరాం రాష్ట్రస్థాయి 854వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఏవీ రమణారెడ్డి విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2 వేల లోపు ఇద్దరికి, 5 వేలలోపు పది మందికి, 10 వేలలోపు 22 మందికి ర్యాంకులు తమ కాలేజీ విద్యార్థులకు లభించాయన్నారు. ఇందుకు కృషిచేసిన అధ్యాపక బృందానికి, అధ్యాపకేతర సిబ్బందికి శ్రీసరస్వతి విద్యాసంస్థల డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగా శంకరరెడ్డి, సీఈవో ఎస్‌వి సురేష్ తదితరులు అభినందనలు తెలిపారు.



854వ ర్యాంకు సాధించిన విద్యార్థి కె.సాకేత్ సాయిరాం

తెలంగాణా ఎంసెట్ ఫలితాల్లో శ్రీప్రతిభ విద్యార్థులు

తెలంగాణ ఈఏపీసెట్ ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నట్లు శ్రీప్రతిభ శ్రీప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీసీ విభాగంలో వడ్లమూడి నందిని చౌదరి 3203వ ర్యాంకు, రావి మహేష్ చౌదరి 3670, నందికంటి వెంకట తరుణ్ కృష్ణ 3934, ఘట్టమనేని మోహిత సాయి 4978, తోట వెంకట అవినాష్ నాయుడు 5059, పుట్లూరి గోవర్ధన్ 5893, పిచ్చల శ్రీనివాసులురెడ్డి 6323, కల్లగుంట పూజిత 6465, కసుకుర్తి ప్రణతి 8523 ర్యాంకులు సాధించారు. 10 వేల లోపు 9 మంది, 15 వేలలోపు 15 మంది, 20 వేల లోపు 23 మంది, 30 వేలలోపు 43 మంది, 40 వేలలోపు 55 మంది, 50 వేలలోపు 64 మంది ర్యాంకులు సాధించారు. బైపీసీ విభాగంలో చెనికల హరిబాబు 3084, బొజ్జా పూర్ణిమ 9542 ర్యాంకులు సాధించారని, ఇంకా 15 వేల లోపు ఆరుగురు, 20 వేలలోపు ఏడుగురు, 30 వేలలోపు 9 మంది, 40 వేల లోపు 12 మంది, 50 వేలలోపు 14 మంది ర్యాంకులు సాధించారని పేర్కొంటూ ర్యాంకర్లను శ్రీప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో జయప్రకాష్ అభినందించారు.



ర్యాంకర్లను అభినందిస్తున్న శ్రీప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు

బావిలో పడి జింక మృతి

ఉలవపాడు: దారి తప్పి పరుగులు తీస్తూ వచ్చి ఒక జింక పాడు బడిన బావిలో పడిపోయింది. ఈ సంఘటన ఉలవపాడులోని వడ్డెరపాలెం లోని కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న బావి వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఉదయం 7 గంటల సమయంలో పరుగెత్తుతూ జనసంచారం చూసి భయపడి గోడ దూకబోయి బావిలో పడిపోయింది. బావిలో నీరు కేవలం అర అడుగు మాత్రమే ఉండడంతో అక్కడే ఉండిపోయింది. స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఒంగోలు నుంచి అటవీ సిబ్బంది వచ్చి తాళ్లతో కట్టి బావి నుంచి బయటకు తీశారు. జింకకు గాయాలు ఉండటంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందింది.



బావిలో పడిన జింక

కనులపండువగా రథోత్సవం

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం శనివారం కనులపండువగా సాగింది. స్వామి కల్యాణం మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కళ్యాణ ఆరాధన అనంతరం రథోత్సవం గ్రామ వీధుల్లో నిర్వహించారు.

హజ్ యాత్రకు బయలుదేరిన ముస్లింలు



హజ్ యాత్రికులతో కలిసి దువా చేస్తున్న ముస్లిం మత పెద్దలు

ఒంగోలు టౌన్: పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకొని జిల్లాలోని ముస్లింలు హజ్ యాత్రకు బయలుదేరారు. జిల్లా నుంచి మొత్తం 87 మంది హజ్ యాత్రకు బయలుదేరగా ఒంగోలు నగరం నుంచి 25 మంది వరకు బయలుదేరారు. ఈ యాత్ర శనివారం రాత్రి ఇషాన్ నమాజు తరువాత మర్కస్ మస్జిద్ వద్దకు చేరుకున్న యాత్రికులకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పట్టణంలోని ముస్లింలు వీడ్కోలు పలికారు. ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులో బయలు దేరి ఆదివారం రాత్రి అక్కడ నుంచి నేరుగా సౌదీ అరేబియాలోని మక్కాకు వెళతారు. మొత్తం 40 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుంది. యాత్రలో భాగంగా మక్కా వెళ్లిన యాత్రికులు అక్కడే హజ్‌ను పూర్తి చేస్తారని, ఆ తరువాత మదీనాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని మత పెద్దలు తెలిపారు. మదీనాలో 10 రోజులు ఉన్న తరువాత తిరిగి ఇండియా చేరుకుంటారు. ఈసందర్భంగా మక్కా మస్జీద్ మౌలానా అబ్దుల్ రహీం ఖాన్ దువా చేశారు. హజ్ యాత్రికుల కోసం హజ్ కమిటి డైరక్టర్ ముహమ్మద్ బాషా బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయనతో పాటుగా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ షేక్ మహబూబ్, కార్పొరేటర్ షేక్ ఇంతియాజ్, వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ జిల్లా నాయకుడు షేక్ ఖాదర్ బాషా, నగర కమిటీ అధ్యక్షుడు షేక్ మున్నా హజ్ యాత్రికులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని కోరారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ షేక్ మహబూబ్ డ్రైఫ్రూట్స్ పంపిణీ చేశారు.

ప్రారంభమైన ఉజ్జీవ సభలు

ఒంగోలు రూరల్: మండలంలోని దేవరంపాడు ఎస్సీకాలనీలో బేతేలు ప్రార్థనా మందిరం ఆవరణలో మూడు రోజులపాటు జరగనున్న ఉజ్జీవ సభలు శనివారం ప్రారంభమయ్యాయి. వైజాగ్‌కు చెందిన రెవరెండ్ విజయ్‌కుమార్ పాల్గొని ప్రార్థనా కూడికల్లో ముఖ్య ప్రసంగం చేశారు. స్థానిక పాస్టర్ అంచెల శేఖర్ ఆధ్వర్యంలో జరుగుతున్న సభలను రిటైర్డ్ హెచ్‌ఎం కుమారి జి.బేబీస్టార్ ప్రార్థన చేసి ప్రారంభించారు. పాస్టర్ సీహెచ్ విక్టర్‌పాల్ నిర్వహించిన ఈ సభల్లో విజయ్‌కుమార్ మాట్లాడుతూ నేటి క్రైస్తవుల్లో నిజమైన భక్తి ఉండాలని పిలుపునిచ్చారు. అలవాటులో భాగంగా ప్రార్థనలు చేయడం, చర్చిలకు వెళ్లడాలు ఆపివేయాలని, దేవుని రాకడ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి హృదయాన్ని దేవుని ఆత్మతో నింపుకోవాలని, శుద్ధి కలిగిన జీవితం అలవరచుకోవాలని కోరారు. ఒంగోలు రూరల్ గ్రామాల్లోని క్రైస్తవులు పాల్గొన్నారు.